క్లుప్తంగా

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

వాజేడు : గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారి సేవలు అభినందనీయమని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో మారుమూల ఉన్న 18 పాఠశాలల్లోని 500 మంది విద్యార్థులకు శనివారం సంస్థ నిర్వాహకులు స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోట్‌బుక్స్ ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మారుమూల ఉన్న నిరుపేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ములుగు రూరల్ : ఈ నెల 5న ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఐ 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందే కష్టజీవుల కొరకు అన్నారు. మంగళవారం డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే మహాసభలకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అమ్జద్ పాషా, రాంబాబు, యాటల పైడి, రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై విచారణ చేపట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ మండల అధ్యక్షుడు గణేష్‌చారి

వెంకటాపురం(కె): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలు జరిగాయని వెంటనే విచారణ చేపట్టాలని కోరుతూ శనివారం బీఎస్పీ మండల అధ్యక్షుడు గణేష్‌చారి అదనపు కలెక్టర్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయకుండా అనర్హులకు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

రామాలయంలో వనమహోత్సవం



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 50 పూల మొక్కలను నాటినట్లు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయం ఆవరణలో గులాబీ, మందార పూలతోపాటు ఇతర పూల మొక్కలను నాటించారు. రామాలయం గుడికి పూల మొక్కలను అందజేసిన ఈజీఎస్ అధికారులకు, సిబ్బందికి రామాలయం కమిటీ సభ్యులు కృతజ్ఞతలుతెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఏ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

మంగపేట : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజం అని హెచ్ఎం కొమరం నాగభూషణం అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బత్తిని వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా హెచ్ఎం ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు.

మరణం వరకు వీడని బంధం 'స్నేహం'

- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం
- సోషల్ మీడియా వేదికగా బలపడుతున్న ఫ్రెండ్‌షిప్
- చిన్ననాటి స్నేహితులను కలుపుతున్న వాట్సాప్ గ్రూప్‌లు



23 ఏళ్ల తర్వాత రామప్ప వేదికగా కలుసుకున్న మిత్రులు (ఫైల్)



27 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సీఆర్‌పీఎఫ్ మిత్రులు (ఫైల్)

వెంకటాపురం(ఎం): స్నేహం ఆ పదం వింటేనే ఏదో తెలియని మధురానుబంధం.. మనసుకు తెలియని ఉత్తేజం, ఉల్లాసం దానితోనే సాధ్యం. బంధం, అనుబంధమైన, రక్త సంబంధాలకన్నా ఒక మనిషి తన కష్టసుఖాలను చెప్పుకునే ఏకైక మనిషి స్నేహితుడు మాత్రమే. అందుకే 'ఒక కవి'అన్నాడు.. మనిషి మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా మారాలంటే ఒక్కసారి నువ్వు చదువుకున్న, పుట్టి పెరిగిన గ్రామానికి వెళ్లి నీ చిన్ననాటి స్నేహితులతో కాసేపు మాట్లాడు..అంతకంటే మించిన ఆనందం నీ జీవితంలో ఏదీ లేదన్నాడు. అందుకే స్నేహితులతో కాసేపు సరదాగా సంభాషిస్తే బాధలు, కష్టాలు, కన్నీళ్లు అన్నీ మటుమాయమే. స్నేహితుడితో కలిసుండే ఆ సమయం, మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటాం. వయస్సు మీద పడుతున్న, శరీరం ముడతలు పడుతున్న, మనసుకు స్వాంతన కలిగించేదీ ఒక్క స్నేహం మాత్రమే. అందుకే స్నేహం ఎప్పుడు వర్ణించలేని ఒక మధురకావ్యం.

వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఒక్కటవుతున్న మిత్రులు

ప్రపంచమే ఒక మాయ.. సోషల్ మీడియా కొంచెం కొంచెంగా సమాజంపై ఆధిపత్యం చెలాయించే స్థాయికి ఎదిగింది. ప్రపంచంలో ఎక్కడ, ఏం జరిగినా ప్రతి విషయం క్షణాల్లో తెలుసుకునే స్థాయికి ఎదిగిపోయాం. కాని అదే టెక్నాలజీ, అదే సోషల్ మీడియాతో చిన్ననాటి మిత్రులంతా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో ఒక్కటవుతున్నారు. పాఠశాలలో ఓనమాలు నేర్చుకున్నప్పటి నుంచి మరణం చివరి వరకు ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని గొడవలొచ్చినా స్నేహం మీద నమ్మకం, స్నేహితుడంటే ప్రాణంతో బతికే వారు ఇప్పటికి చాలామందే ఉన్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, ఆ తర్వాత కాలంలో ఫోన్‌లు మాట్లాడుకునే స్థాయి నుంచి సోషల్ మీడియా సాయంతో ప్రస్తుతం ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాలతో విద్యనేర్పిన గురువులను సన్మానిస్తూ చిన్నపిల్లలగా మారిపోయి పాతరోజులను గుర్తు చేసుకుంటూ బాల్యం ఇంకా మిగిలి ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు.

23 ఏళ్లకు కలుసుకున్నాం



మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శిశు తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాం. 1995–96లో పదో తరగతి పరీక్షలు రాసి విడిపోయాం. ఒక్కొక్కరూ ఒక్కొక్క ప్రదేశంలో ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా స్థిరపడిపోయారు. సోషల్ మీడియా ద్వారా 2018లో గ్రూప్‌గా ఏర్పడి రామప్ప ఆలయం వేదికగా అందరం కలుసుకున్నాం. 23 ఏళ్ల తర్వాత కలుసుకోవడం చాలా అద్భుతంగా అనిపించింది. అప్పటి నుంచి వా ట్సాప్ గ్రూప్ వేదికగా కలుసుకుంటున్నాం.

– పల్నాటి రాజేంద్ర, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

వాట్సాప్‌తోనే తిరిగి కలుసుకున్నాం



మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేశాక 1993లో మిత్రుడు నూనె అశోక్‌కు, నాకు సీఆర్‌పీఎఫ్ ఉద్యోగం వచ్చింది. 1994లో మద్రాస్‌లో ట్రైనింగ్ పూర్తి చేసే సమయంలో 115 మంది దోస్తులయ్యారు. వివిధ ప్రాంతాల్లో నాలుగేళ్లు ఉద్యోగం చేసి తల్లిదండ్రుల కోరిక మేరకు 1998లో ఉద్యోగం వదిలేసి ఇంటికి వచ్చాను. ఫోన్‌లు అందుబాటులోకి రావడంతో పాటు సోషల్ మీడియా ద్వారా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం.

– పోశాల వీరమల్లు, సీఆర్‌పీఎఫ్ మాజీ ఉద్యోగి, వెంకటాపురం(ఎం)

సమస్యలు పరిష్కరించాలని నిరసన



వెంకటాపురం: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

వాజేడు : మండలంలోని భువనపల్లి, ధర్మవరం, చింతూరు గ్రామ పంచాయతీల్లో పలు సమస్యలు పేరుకుపోయాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కోరకల్ నుంచి చింతూరు వరకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారిందని దానిని ఇంత వరకు మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రహదారి వెంట ఉన్న 7 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా చింతూరు, ధర్మవరం, చెరుకూరు తదితర గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలపై ఈ నెల 5 వరకు పరిశీలన చేసి 6 నుంచి 11 వరకు గ్రామ పంచాయతీల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరికాదన్నారు. కార్యక్రమంలో సదాక్రీన్, నరేశ్, చంద్ర శేఖర్, పగిడయ్య, ముకుందరావు, విజయ్, లాలయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

వెంకటాపురం(కె) : మండల కేంద్రం నుంచి యాకన్నగూడెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శనివారం ఆలుబాక గ్రామంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ హాజరై మాట్లాడుతూ ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్లకు నిధులు కేటాయించి కొత్త రోడ్లు వేయాలని అన్నారు. రాళ్లవాగు బ్రిడ్జి రెండో పిల్లర్ సైతం దెబ్బతిందని కూలేందుకు సిద్ధంగా ఉందని దాన్ని పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. మండంలోని సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని ప్రజల మద్దతు ఇవ్వాలని కోరారు. మండల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న చేపట్టిన మండల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, వంకా రాములు, కుమ్మరి శ్రీను, పండా శ్రీను, వీరవేణి, రంగయ్య, కృష్ణతోట నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు



కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడు, ఎంఈఓ వెంకటేశ్వర్లు

వాజేడు : విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని పూసూరు, కొంగాల, దూలాపురం, చెరుకూరు గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు జంగాలపల్లిలోని కేజీబీవీని పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలలను, వంటలను చూడటంతో పాటు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అలాగే పూసూరు, కొంగాల, దూలాపురం, చెరుకూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోయడంతో పాటు ఇంతకు ముందే ప్రారంభమైన ఇంటి పరిస్థితిని పరిశీలించారు. చెరుకూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు స్నాక్స్ పంపిణీ



స్నాక్స్ అందుకున్న చిన్నారులతో అనిల్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయగూడెంలోని చిన్నారులకు ప్రజాసేవకుడు వట్టపల్లి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం రంగుల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆయన యువకులతో కలిసి గూడెంలోని వంద మంది పిల్లలకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2న జరుపుకునే రంగుల పుస్తక దినోత్సవాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. చిన్నారులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని కల్పించే రంగుల పుస్తకాలను ముద్రించి 2015లో ఆవిష్కరించారన్నారు. గిరిజన విద్యార్థులు విద్యా విజ్ఞానంతో ప్రతిభావంతులు కావాలనే ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గొడ సంఘం నాయకుడు నిమ్మల బాలరాజు, నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాజు, యువజన సంఘం నాయకులు ఎనగంటి సంజయ్, రణదీర్, రాంబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



భూపాలపల్లి అర్బన్: బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



రేగొండ: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎమ్మెల్యే శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా రూ.3.10కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఆధునిక సీటీ స్కాన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఈ యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆస్పత్రిని 300 బెడ్స్‌కు పెంచుతామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో వైద్యాన్ని నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపించారు. అనంతరం ఆస్పత్రిలోని ప్రతీ వార్డు తిరుగుతూ రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

రేగొండ: విద్యారంగానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కేజీబీవీని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేని గత పాలకులు ఇప్పుడు హాస్టళ్లను సందర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూ టోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు భిక్షపతి ఉన్నారు.

పొనగండ్లలో దొంగల హల్‌చల్

రేగొండ: మండలంలోని పొనగండ్లలో రాజు ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు గ్యాస్ సిలిండర్‌ను దొంగిలించారు. వారం క్రితం వంగ చిన్న ఐలక్క ఇంట్లో, గతంలో నాంపల్లి వనక్కకు చెందిన గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లారు. అలాగే రెండు నెలల క్రితం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేయించి కనెక్షన్ ఇవ్వడానికి రైతులు తీసుకువచ్చారు. కానీ మరుసటి రోజు వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా గ్రామంలోని పొలాల వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్ డబ్బాలను, విద్యుత్ తీగలను కట్ చేసి చోరీలకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఎన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నా, హెచ్చరికలు జారీ చేస్తున్న దొంగలు ఆగడం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మెడిటేషన్ ప్రోగ్రాం జోనల్ కో ఆర్డినేటర్ మాధవి

ములుగు రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మెడిటేషన్ ప్రోగ్రాం జోనల్ కోఆర్డినేటర్ మాధవి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హార్ట్ ఫుల్‌నెస్ హెల్ప్ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎండి.రహీమొద్దిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు రాధిక, కవిత, రహీమ్, సారంగపాణి, కిరణ్, భద్రయ్య, రామారావు, హరిగోపాల్, లక్ష్మయ్య, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

వాజేడు : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని అరుణాచలపురం గ్రామం వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన కావిరి ముత్తయ్య వెంకటాపురం(కె) మండలం నుంచి స్వగ్రామానికి వస్తుండగా అరుణాచలపురం గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి పోయింది. ఈ ప్రమాదంలో ముత్తయ్యకు గాయాలు కావడంతో హుటాహుటిన వాజేడు వైద్యశాలకు తరలించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: ప్రయాణికులతో మాట్లాడుతున్న పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్



ఏటూరునాగారం : వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలను నిర్వహించారు. మావోయిస్టులు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తువులపై ప్రత్యేక నిఘాను ఉంచారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూస్తున్నారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించడంతో పాటు ప్రయణికుల బ్యాగులను సోదాలు చేస్తున్నారు.

ఏటూరునాగారం : మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజ్‌కుమార్, పీఎస్సైలు నరేష్, రచిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటాపురం(కె): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఒంటిమామిడి గ్రామంలో వివిధ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించే విధానంపై రైతులకు శనివారం అవగాహన సదస్సును ఆదివాసీ నవ నిర్మాణ సేవ సౌజన్యంతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆగ్రానమిస్ట్ నాగభూషణం మాట్లాడుతూ రైతులు వరి, మిర్చి, మొక్కజొన్న పంటల సాగులో నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. వరి నారు పోసిన పది నుంచి పదిహేను రోజుల లోపే నాటు వేయాలని సూచించారు. ముదరు నారు నాటితే అదనంగా 20కిలోల ఎరువును వేయాల్సి ఉంటుందని తెలిపారు. లోతు దుక్కులు వేసి సకాలంలో దున్నుకోవటం వల్ల తెగుళ్లకు కారణమైన పురుగులు అంతరించి పోతాయని వివరించారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వీరన్న, ఏటూరునాగారం ఏడీఏ అవినాష్ వర్మ, ఆదివాసీ నవ నిర్మాణ సేన అధ్యక్షులు కోర్సా నర్సింహమూర్తి, కార్యనిర్వహక అధ్యక్షులు వాసం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫాగింగ్ మరిచిన అధికారులు

మంగపేట: గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చి రెండు నెలలు పూర్తయినా ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయకుండా ఏం చేస్తున్నారని గ్రామాల్లోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వారికి తీరిక సమయాల్లో వస్తూ విధులకు హాజరైనట్లు సెల్‌ఫోన్‌లో ఫొటో దిగి వెళ్తున్నారే తప్ప స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో ని 25 గ్రామ పంచాయతీల్లో ఒకటి, రెండు గ్రామాల్లో తప్ప ఏ పంచాయతీలో ఎక్కడ కూడా ఇప్పటి వరకు దోమల నివారణకు ఫాగింగ్ చేయలేదని ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి ప్రతి గ్రామపంచాయతీకి ఒకటి, కొన్ని పంచాయతీలలో రెండు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినా అధికారులు వాటిని వినియోగించకుండా పూజలు చేస్తున్నారా అంటు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఉండాల్సిన ఫాగింగ్ మిషన్లు కొన్ని ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడేసి దర్శనమివ్వడం గమనార్హం. ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో తమను అడిగేవారు లేరనే దీమాతో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా నామమాత్రంగా విధులకు హాజరవుతూ పంచాయతీల పాలనను సిబ్బందికి వదిలేసి వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి బురదరోడ్లుగా తయారై నడవలేని విధంగా తయారై పారిశుద్ధ్యం పేరుకుపోయి దోమలు విపరీతంగా వృద్ధి చెద్ది రాత్రి వేళల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్, పారిశుద్ధ్యం పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడిన ఫాగింగ్ మిషన్లు

భూ కబ్జాకు పాల్పడిన ఇరువురి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో నకిలీ పత్రాలతో భూ కబ్జాకు పాల్పడిన ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. మంజూర్‌నగర్‌లోని కేటీకే 8వ గని ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్ 172లో భూమి లేకపోయినా హనుమకొండకు చెందిన శ్రీరామోజు మహేందర్, కొంపల్లి గ్రామానికి చెందిన భూక్య సురేష్ తప్పుడు పత్రాలు సృష్టించినట్లు తెలిపారు. ఈ సర్వే నంబర్‌లో 20 గుంటల భూమిని అమ్మినట్లు పత్రాలు సృష్టించి భూమి యాజమాని కోనారి రవీందర్‌ను బెదిరింపులకు గురిచేశారు. దీంతో రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైన భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై సాంబమూర్తి, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.